సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 23 । జూలై । 2024



ప్రతి అర్జీకి న్యాయం జరగాలి

ప్రతి అర్జీకి సరైన న్యాయం చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. 8లో



స్థాయీ సంఘం ఎన్నికలు

విశాఖ: జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికలు వచ్చే నెల 7న జరగనున్నాయి. నామినేషన్లను ఈనెల 30 వరకు స్వీకరిస్తారు.



స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవాలి

విశాఖ: పార్లమెంట్‌లో ఎంపీలు గళమెత్తాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ డిమాండ్ చేసింది.

న్యూస్‌రీల్

అనకాపల్లికి 14 మంది ఎస్‌ఐలు

విశాఖ సిటీ: విశాఖ రేంజ్ పరిధి నుంచి 14 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను అనకాపల్లి జిల్లాకు కేటాయించారు. ఇక్కడి నుంచి 14 మంది ఎస్‌ఐలను రేంజ్ పరిధిలో పలు జిల్లాలకు బదిలీ చేశారు. ఈ మేరకు డీఐజీ గోపీనాథ్ జెట్టి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురం మన్యం నుంచి వి.సోమలింగం, జి.సత్యనారాయణ, ఎస్.అప్పలకొండలను అనకాపల్లికి కేటాయించారు. శ్రీకాకుళం నుంచి ఎం.సురేంద్రకుమార్, యు.రాజారావు, ఎం.వెంకటరావు, ఎస్.కె.రషీద్, జె.నాగేశ్వరరావు, జి.విశ్వనాథం, పి.ప్రసాదరావు, కె.ఎస్.నారాయణ, పి.వారి, పి.వి.రమణ, ఎస్.కె.మదీనవల్లీలను అనకాపల్లికి పంపించారు. అనకాపల్లి నుంచి వి.శ్రీనివాసరావు, ఎం.పాపయ్య, ఐ.వి.జి.శంకరరావు, బి.రామారావు, ఎస్.గఫూర్, పి.వెంకటరమణ, ఎస్. సోమశేఖరరావు, టి.రామారావు, జె.రామారావు, ఎం.కోటేశ్వరరావు, ఎ.ఎస్.వి.వెంకటరావు, పి. శ్యామలరావు, కె.రమేష్‌బాబు, ఎం.వి.రమణలను విశాఖ రేంజ్ పరిధిలో పలు జిల్లాలకు బదిలీ చేశారు.

రావణాపల్లి రిజర్వాయర్‌కు గండి



గండిని పూడ్చి వేస్తున్న రైతులు, ఇరిగేషన్ సిబ్బంది

నర్సీపట్నం: రావణాపల్లి రిజర్వాయర్‌కు సోమవారం సాయంత్రం గండి పడింది. భారీ వర్షాల కారణంగా రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటిమట్టానికి మించి వరద నీరు రావడంతో పొర్లుకట్టు మీద నుంచి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు జలాశయంలోకి చేరుతోంది. వరద నీటి ఉధృతికి రిజర్వాయర్ గట్లు బలహీనమై గండి పడింది. సమాచారం తెలుసుకున్న ఆర్డీవో హెచ్.వి.జయరాం, పోలీసులు, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. రైతుల సహాయంతో ఇసుక బస్తాలతో గండిని పూడ్చి వేశారు. దీంతో అధికారులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

దేవరాపల్లి ఎంపీపీగా చింతల బుల్లిలక్ష్మి



బుల్లిలక్ష్మి

దేవరాపల్లి: స్థానిక మండల పరిషత్ అధ్యక్షురాలి(ఎంపీపీ)గా వైఎస్సార్‌సీపీకి చెందిన ఎ.కొత్తపల్లి ఎంపీటీసీ సభ్యురాలు చింతల బుల్లిలక్ష్మి నియమితులయ్యారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశాల మేరకు జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు బుల్లిలక్ష్మికి నియామక పత్రాన్ని సోమవారం అందజేయగా, వెంటనే ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు వైస్ ఎంపీపీ-1 పనిచేస్తున్న బుల్లిలక్ష్మి ఇకపై ఎంపీపీగా పూర్తి అధికారాలను వినియోగించుకుంటారని సీఈవో ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్త అధ్యక్ష(ఎంపీపీ) పదవికి ఎన్నిక జరిగేంత వరకు బుల్లిలక్ష్మి ఎంపీపీగా పూర్తి అధికారాలతో కొనసాగుతారని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. గతంలో ఎంపీపీగా పని చేసిన కిలపర్తి రాజేశ్వరి ఏప్రిల్ 15న వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఎంపీపీ పదవి ఖాళీగా ఉంది.

ప్రత్యేక హోదాపై మౌనమేల?

- కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజా సంఘాల ఐక్యవేదిక ధ్వజం

అనకాపల్లి: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కోసం వివిధ పక్షాలు గళమెత్తాయని, కూటమి నేతలు మాత్రం మౌనం వహించారని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్ని యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. విభజన సమయంలో పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీ ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సభ్యులు డిమాండ్ చేయగా అధికార కూటమి టీడీపీ, జనసేన, బీజేపీ పార్లమెంట్ సభ్యులు మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. బిహార్ నుంచి ఎన్డీఏ భాగస్వామి జేడీయూ ఆ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని పట్టుపట్టిందని దానికి ప్రతిపక్షాలైన ఆర్జేడీ, ఎల్పీజే పార్టీలు మద్దతుగా నిలిచాయని, అంతే కాకుండా ఒడిశా రాష్ట్రం నుంచి కూడా తమకు ప్రత్యేక హోదా కల్పించాలన్న డిమాండ్ వినిపించిందని, ఏపీ నుంచి కూటమి ఎంపీలు ఎందుకు గళం విప్పలేదని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలన్నారు.



ఇదీ మా గుండె చప్పుడు

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ప్రజా ప్రతినిధులుగా జిల్లా ఎమ్మెల్యేలు తమ ప్రాంతానికి సంబంధించిన అంశాలను ప్రస్తావించేందుకు వచ్చిన చక్కని అవకాశమిది. ఎన్నో ఆశలు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తమ హామీలు కార్యరూపం దాల్చేలా శాసనసభ్యులు సభలో గట్టిగా మాట్లాడాలి. సమస్యలను వివరించి నిధులు రాబట్టాలి. జిల్లా నుంచి ఎన్నికైన తమ ఎమ్మెల్యేలు సభలో ఎలా వ్యవహరిస్తారా అని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన మంచి పనులను కొనసాగించాలని వారు కోరుతున్నారు.



ఎమ్మెల్యేలూ..

- అభివృద్ధిపై దృష్టి సారిస్తారా?
- హామీలు అటకెక్కిస్తారా?
- అసెంబ్లీలో జిల్లా అంశాలు ప్రస్తావించి నిధులు రాబట్టాలని కోరుతున్న ప్రజలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన మంచి పనులను కొనసాగించాలని వినతి

సాక్షి, అనకాపల్లి: జిల్లా అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రధానమైన అంశాలను అసెంబ్లీలో ప్రస్తావిస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. సమస్యలపై అధ్యయనం చేసి సభలో చక్కగా వివరిస్తే ప్రయోజనముంటుంది. ఎమ్మెల్యేల ప్రతిపాదనలను మంత్రులు కాదనలేని పరిస్థితి వస్తుంది. శాసనసభ్యులు అసెంబ్లీలో గళం విప్పి తమ ప్రాంత ప్రజల మనోభావాలను ప్రతిఫలింపజేయాలని రాజకీయ నిపుణులు, సామాజిక వేత్తలు, రైతులు సూచిస్తున్నారు. అలాగే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ఎన్నో మంచి ప్రాజెక్టులు మధ్యలో ఉన్నాయి. వాటిని పెద్ద మనసుతో కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. 'సాక్షి' సామాన్య ప్రజల అజెండా ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేసింది.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని సస్యశ్యామలం చేసేందుకు రూ.470.05 కోట్లతో ఏలేరు-తాండవ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టింది. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారిస్తే రైతాంగానికి మేలు చేకూరుతుంది. అనకాపల్లి, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లోని వేలాది ఎకరాలు సస్యశ్యామలం అవుతాయి.
- మహానేత వైఎస్సార్ హయాంలో శ్రీకారం చుట్టిన పోలవరం ఎడమ కాలువ నిర్మాణపనులు ఆయన మరణానంతరం పడకెక్కాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జూన్ నెలలో ఎస్.రాయవరం మండలంలో దార్లపూడి పోలవరం ఎడమ కాలువ అక్విడెక్ట్ నిర్మాణపనులను 93వ కి.మీ వరకూ త్వరితగతిన పూర్తిచేస్తామని చంద్రబాబు చెప్పారు. వీటికి రూ.800 కోట్లు మంజూరు చేస్తానని చెప్పారు. అవి త్వరితగతిన పూర్తిచేయాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తయితే జిల్లాలో 2 లక్షల 80 వేల ఎకరాలకు సాగునీటి సమస్య తీరుతుంది.
- ప్రతి జిల్లాలో ఒక వైద్య కళాశాల నెలకొల్పాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణం ప్రారంభించారు. ఇది పూర్తయితే వైద్యవిద్య అందుబాటులోకి రావడంతో పాటు నర్సీపట్నం ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి వస్తుంది.
- నక్కపల్లిలో 5 వేల ఎకరాల్లో బల్క్‌డ్రగ్ పార్కుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్రూవల్ వచ్చింది. స్టార్టప్ ఏరియా కోసం 1100 ఎకరాలు సిద్ధం చేశారు. రూ.399 కోట్లు మంజూరు చేశారు. రైతుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద పరిహారం చెల్లించాలని టీడీపీ డిమాండ్ చేసింది. స్థానిక టీడీపీ నాయకులు పనులు కూడా అడ్డుకున్నారు. ఇప్పుడు ఆ డిమాండ్‌ను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలి.
- తాండవ సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి. గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి అదనపు నిధులు కేటాయించి 24 వేల మంది చెరకు రైతులను ఆదుకోవాలి.
- తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ 1999–2004లో చంద్రబాబు సీఎంగా ఉండగా మూతపడింది. 2004లో వైఎస్సార్ తెరిపించారు. 2014–19లో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు మళ్లీ మూతపడింది. కార్మికులు పెండింగ్ జీతాల కోసం కోర్టులో కేసులు వేశారు. ఈ సమస్యను పరిష్కరించడం ఎంతో అవసరం. 15 వేల మంది చెరకు రైతులు, 300కి పైగా ఉద్యోగులు దీనిపై ఆధారపడి ఉన్నారు.
- గండవరం నుంచి రోలుగుంట వరకు సుమారు 50 కి.మీ మేర బీఎన్ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.112 కోట్లు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ కారణంగా పనులు నిలిచి పోయాయి. ఈ సమస్యను అసెంబ్లీలో లేవనెత్తి ఈ రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలి.
- **బుచ్చెయ్యపేట మండలం కోమళ్లపూడి వద్ద 160 ఎకరాలతో సెజ్ ఏర్పాటు చేయాలని భూసేకరణ కూడా పూర్తి చేశారు. పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తే వేలాది మంది స్థానిక యువతకు ఉద్యోగావ**కాశాలు లభిస్తాయి.
- కశింకోటలో గవరపేట సమీపంలో శారద నదిపై దాదాపు రూ.3 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 20 శాతం పనులు పూర్తయ్యాయి. ఆ పనులు టీడీపీ ప్రభుత్వంలో పూర్తిచేయాలి.
- అనకాపల్లి టౌన్‌లో లక్ష్మీదేవిపేటలో గల రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి దాదాపుగా రూ.30 కోట్ల అవసరం ఉంటుంది. వైఎస్సార్ హయాంలో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆయన మరణానంతరం అది నిలిచిపోయింది.
- కోడూరులో 129 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలిదశలో 59 ఎకరాలను అభివృద్ధి చేశారు. అక్కడ రూ.12.63 కోట్లతో రహదారులు, డ్రైనేజీలను అభివృద్ధి చేస్తే వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

మెడికల్ కళాశాల పూర్తి చేయాలి

అసంపూర్తిగా ఉన్న మెడికల్ కళాశాలను పూర్తి చేస్తే పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. వైద్యవిద్య జిల్లా యువతకు అందుతుంది. పేద ప్రజల ఆకాంక్షను పరిగణనలోకి తీసుకుని వీలైనంత త్వరగా మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలని జిల్లా ఎమ్మెల్యేలు ప్రస్తావిస్తే బాగుంటుంది. ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా కూటమి శాసనసభ్యులు వ్యవహరించాలి.

– పిల్లా శ్రీను, మాకవరపాలెం

ఎత్తిపోతల పథకంతో రైతులకు మేలు



తాండవ-ఏలేరు ఎత్తిపోతల పథకాన్ని అందుబాటులోకి తీసుకువస్తే సాగునీరుతోపాటు తాగునీటి కష్టాలు తీరుతాయి. ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారిస్తే బీడు భూములు సైతం పంట భూములుగా మారుతాయి. రెండు పంటలతో రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

– పోలుపర్తి చిట్టిబ్బాయి, గునిపూడి నాతవరం మండలం

చెరకు రైతులు, కార్మికులను ఆదుకోవాలి..

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీపై 17 వేలమంది చెరకు రైతులు, 500 మంది శాశ్వత, తాత్కాలిక ఉద్యోగుల కుటుంబాలు ఆధారపడి ఉండేవి. వారికి జీతాల బకాయి కూడా రావలసి ఉంది. ఈ ఫ్యాక్టరీని తెరిపించడమో.. లేదంటే ఇక్కడ ఇథనాల్ పరిశ్రమను ఏర్పాటు చేయడమో చేయాలి. స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఈ సమస్యను ప్రస్తావిస్తే బాగుంటుంది.

–సీహెచ్ రామచంద్రరావు, రైతు, అనకాపల్లి

గరీబ్‌రథ్.. న్యూ లుక్

- కొత్త కోచ్‌లలో హాయి... హాయి..
- గరీబ్‌రథ్‌కు పాత కోచ్‌ల తొలగింపు
- పెరగనున్న సీటింగ్ సామర్థ్యం
- అత్యాధునిక వసతులతో కూడిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

తాటిచెట్లపాలెం (విశాఖ): రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్. విశాఖ నుంచి సికింద్రాబాద్ ప్రతిరోజూ నడిచే గరీబ్‌రథ్ ఇక నుంచి కొత్త లుక్‌లో కనిపించనుంది. ఈ రైలుకు ఎల్‌హెచ్‌బీ (లింక్ హాఫ్‌మన్ బుష్) బోగీలుగా మార్చాలని రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. ఇంతవరకు ఐసీఎఫ్ (ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ) బోగీలతో నడిచిన రైలు మంగళవారం నుంచి ఎల్‌హెచ్‌బీ బోగీలతో దూసుకుపోనుంది. 2008లో ప్రారంభమైన ఈ గరీబ్‌రథ్ ఐసీఎఫ్ (ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ) బోగీలతో నడుస్తోంది. అయితే ఈ ఐసీఎఫ్ బోగీలు పాతబడిపోయి తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలోనే ఐసీఎఫ్ బోగీలను ఎల్‌హెచ్‌బీ బోగీలుగా మార్చాలని రైల్వేశాఖ నిర్ణయించింది.

నేటి నుంచి మారిన కోచ్‌లతో..

విశాఖ-సికింద్రాబాద్- విశాఖ గరీబ్‌రథ్ ఇప్పటివరకు పాత ఐసీఎఫ్ కోచ్‌లతో నడిచింది. ఈ గరీబ్‌రథ్ మంగళవారం నుంచి అధునాతన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో పరుగులు తీయనుంది. ఇప్పటివరకు ఈ రైలు 17-థర్డ్ ఏసీ కోచ్‌లతో నడిచేది, ఇకమీదట 18 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడవనుంది. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో ప్రయాణికులకు మరింత సౌకర్యం, మరిన్ని అధునాతన వసతులు సమకూరనున్నాయి. సీటింగ్ సదుపాయం కూడా పెరగనుంది. మరింత వేగం కూడా పెరిగే అవకాశం ఉంది.



పేద, సాధారణ, మధ్యతరగతి ప్రయాణికులకు ఏసీ కోచ్‌లలో ప్రయాణం కలగా ఉండేది. కానీ భారతీయ రైల్వే 2005లో ఇటువంటి వారి కోసం తక్కువ టికెట్ చార్జీలతో ఏసీ ప్రయాణాన్ని పరిచయం చేసింది. ఇది పేదవారి కోసమే నడిచే రైలు కాబట్టి గరీబ్ రథ్ (పేదవాడి రైలు)గా నామకరణం చేశారు. మామూలు థర్డ్ ఏసీ కోచ్‌ల కంటే కొన్ని తక్కువ సదుపాయాలతో ఈ గరీబ్‌రథ్ రైళ్లు నడుస్తున్నాయి. విశాఖ నుంచి నడిచే ఏకైక గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌ను 2008 అక్టోబరు 25వ తేదీన ప్రారంభించారు.

చోరీ మొబైల్స్ రికవరీ మేళా

- బాధితులకు రూ.25 లక్షల విలువైన 176 మొబైల్ ఫోన్లు అందజేసిన ఎస్పీ

అనకాపల్లి: ఆధునిక సాంకేతికను ఉపయోగించి చోరీకి గురైన మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేస్తున్నారని, ఐటీ కోర్ టీం ప్రతిభ అభినందనీయమని ఎస్పీ ఎం.దీపిక పాటిల్ కొనియాడారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. మొబైల్స్ పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులకు రికవరీ ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జిల్లాలో ఆరు విడతల్లో మొత్తం సుమారు 3500 ఫిర్యాదులు నమోదు కాగా.. రూ.2.45 కోట్ల విలువైన 1,756 మొబైల్ ఫోన్లు రికవరీ చేసినట్లు ఆమె తెలిపారు. ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి కూడా ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేయడం జరిగిందన్నారు. గతంలో ఐదు విడతల్లో 1580 ఫోన్లు రికవరీ చేశామని, ఆరో విడతగా రూ.25 లక్షల విలువైన 176 మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేస్తున్నామన్నారు. మొబైల్ మిస్సింగ్ కేసులలో త్వరితగతిన రికవరీ అవుతున్నందున ప్రజలు ఫిర్యాదు చేయడానికి ముందుకు వస్తున్నారన్నారు. అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, సీఐలు చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, గణేష్, ఎస్సై రఘు వర్మ, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



చోరీకి గురైన మొబైల్‌ను సొంతదారునికి అందజేస్తున్న ఎస్పీ దీపిక

సీఆర్‌జెడ్ విస్తరణ గుబులు

- 43 గ్రామాల్లో సీజెడ్ఎం ప్లాన్ అమలుకు సన్నాహాలు
- ప్రతి పనికీ కేంద్రం నుంచి అనుమతి కావాల్సిందే!
- నేడు కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ
- ప్రభావిత గ్రామాల్లో భయాందోళనలు



సీఆర్‌జెడ్ పరిధిలోకి తీసుకువస్తున్న సీహెచ్ఎల్ పురం గ్రామం



సీఆర్‌జెడ్ పరిధిలోకి చేరనున్న రాజయ్యపేటలో ఏపీఐఐసీ సేకరించిన భూములు

నక్కపల్లి: జిల్లాలో తూర్పుతీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఆరు మండలాల్లో కోస్టల్ రెగ్యులేషన్ జోన్(సీఆర్‌జెడ్)ను మరింత విస్తరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు చేస్తున్నాయి. కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్(సీజెడ్ఎం) ప్లాన్ ఖరారు చేసి, ఆమోదం కోసం మంగళవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఇదే జరిగితే జిల్లాలోని మొత్తం విస్తీర్ణం(4014.52 చ.కి.మీ)లో 359.2 చ.కి.మీ. ఈ చట్టం పరిధిలోకి చేరనుంది. దీనిపై బాధిత గ్రామాల నుంచి వ్యతిరేకత, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ప్రజాభిప్రాయ సేకరణ ఆయా మండలాల్లో కాకుండా, కలెక్టర్ కార్యాలయం నిర్వహిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది.

అర కిలోమీటర్ దాటి 5 కి.మీ.కు పైగా..

సీఆర్‌జెడ్-2011 స్థానంలో ప్రభుత్వం సీఆర్‌జెడ్-2019ను అమలు చేసేందుకు నిర్ణయించింది. సీఆర్‌జెడ్ పరిధి సముద్ర తీరానికి 500 మీటర్ల(అర కిలోమీటర్) లోపున్న ప్రాంతాలకు వర్తిస్తుంది. ప్రభుత్వం విడుదల చేసిన సీజెడ్ఎం డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో ఈ పరిధిని మరింత పెంచేందుకు ప్రతిపాదించింది. ఇందుకు మత్స్యకారుల జీవనోపాధికి భద్రత, తీరప్రాంత పర్యావరణ పరిరక్షణ, గ్లోబల్ వార్మింగ్ నియంత్రణ తదితర కారణాలను పేర్కొంది. తాజా ప్రతిపాదనల్లో 5 కి.మీ. నుంచి 10 కి.మీ. దూరంలో ఉన్న ప్రాంతాలను కూడా చట్ట పరిధిలోకి తీసుకురానుండటం ప్రజల్లో ఆందోళన పెంచుతోంది.

సీఆర్‌జెడ్‌లో చేరే గ్రామాలు

- నక్కపల్లి మండలంలోని గునిపూడి, చందనాడ, చుక్కలవాని లక్ష్మీపురం, డీఎల్ పురం, నెల్లిపూడి, పెదతీనార్ల, రాజయ్యపేట
- పాయకరావుపేటలోని పెంటకోట, ఈదటం, కేశవరం, కుమార పురం, మాసాహెబ్‌పేట, రాజవరం, శ్రీరాంపురం
- ఎస్.రాయవరం మండలంలో లింగరాజుపాలెం, జేవీ పాలెం, పెద ఉప్పలం, చిన ఉప్పలం, పేటసూదిపురం, సర్వసిద్ధి, ఉప్పరాపల్లి, వాకపాడు, గుడివాడ
- అచ్యుతాపురం, రాంబిల్లి, పరవాడ మండలాల్లో పూడిమడక, చిప్పాడ, కట్టబోలు, మురకాడ, మర్రిపాలెం, రజాల, రాజుల అగ్రహారం, కలవలపల్లి, రాంబిల్లి, తంతడి, చీపురుపల్లి, అప్పికొండ, దేవాడ, చీపురపల్లి గ్రామాలు ఉన్నాయి.

అమలుతో జరిగే పరిణామాలు!

- కొత్త పరిశ్రమల ఏర్పాటు, విస్తరణపై ఆంక్షలు ఉంటాయి.
- చమురు నిర్వహణ, ప్రమాదకర పదార్థాల నిల్వ లేదా పారవేయడం నిషేధం.
- కొత్త ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి కుదరదు.
- భూమి పునరుద్ధరణ, కట్టడాలు తదితర చర్యలు సముద్రపు నీటి ప్రవాహానికి భంగం లేకుండా ఉండాలి.
- పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను ఈ గ్రామాలు, ప్రాంతాల మీదుగా విడుదల చేయరాదు.
- ఇసుక, రాయి వంటి తవ్వకాలు చేపట్టరాదు.
- భూగర్భ జలాల వినియోగంపై ఆంక్షలు ఉంటాయి.

ఏపీఐఐసీ భూముల మాటేంటి?

కొత్త చట్టం అమలు నేపథ్యంలో ఏపీఐఐసీ వారు విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములు కూడా ఈ గ్రామాల పరిధిలోనే ఉన్నాయి. ఇప్పటికే ఏపీఐఐసీ 5 వేల ఎకరాలను సేకరించింది. సీజెడ్ఎం ప్లాన్‌లో చందనాడ, రాజయ్యపేట, డీఎల్ పురం గ్రామాలు కూడా ఉన్నాయి. ఈ గ్రామాల్లో సేకరించిన సుమారు 1200 ఎకరాల భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు సందేహంలో పడింది. దీనికి తోడు సీహెచ్ఎల్ పురం, నెల్లిపూడి, మోసయ్యపేట, శ్రీరాంపురం లింగరాజుపాలెం, గుడివాడ తదితర గ్రామాలు సముద్రతీరానికి 5 నుంచి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. ఈ గ్రామాల్లో కొత్త చట్టం అమలుపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ఇది కూటమి ప్రభుత్వ కుట్ర



తీరప్రాంతానికి 5 నుంచి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామాలను సీఆర్‌జెడ్ పరిధిలోకి తేవడం దారుణం. ఇది కూటమి ప్రభుత్వ కుట్ర.. ఆమోదం పొందితే ప్రతిదానికీ కేంద్రం అనుమతి తీసుకోవాలి. గ్రామీణులకు అది అయ్యే పని కాదు. తీరానికి దూరంగా ఉన్న గ్రామాలను మినహాయించాలి.

– వీసం రామకృష్ణ, నక్కపల్లి

పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం



మా గ్రామాన్ని సీఆర్‌జెడ్‌లో చేర్చడం తగదు. గ్రామాల్లో ఎలాంటి సమావేశం జరపకుండా అనకాపల్లిలో నిర్వహించడం తగదు. గ్రామస్తుల తరపున మా వ్యతిరేకత తెలుపుతాం. కొత్తగా ఇళ్లు కట్టుకోవడానికి, వ్యవసాయ సాగుకూ కేంద్రం అనుమతి తీసుకోవాలి. దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం.

– కర్రి రాజబాబు, సీహెచ్ఎల్ పురం

హక్కులను కోల్పోతాం



మా గ్రామాన్ని సీఆర్‌జెడ్ పరిధిలోకి తెస్తున్న విషయం మా గ్రామస్తులకు చెప్పక పోవడం దారుణం. పంచాయతీ అనుమతి తీసుకోవాలి. తీరానికి దూరంగా ఉన్న మా గ్రామాన్ని చేర్చితే మేం చాలా ఇబ్బంది పడతాం. మా హక్కుల్ని కోల్పోతాం. ఈ ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిస్తున్నాం.

– సురేష్‌వర్మ, నెల్లిపూడి

ప్రభుత్వాలది ద్వంద్వ వైఖరి



సీఆర్‌జెడ్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయి. కొత్త ప్లాన్ ప్రకారం మత్స్యకారుల జీవనోపాధి దెబ్బ తింటుంది. ఫిష్ ప్రాసెసింగ్ సెంటర్లపై ఆంక్షలు విధించింది. ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమల స్థాపనపై స్పష్టత లేదు. దీన్ని వ్యతిరేకిస్తున్నాం.

– ఎం.అప్పలరాజు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు

ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మాకవరపాలెం: ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (నాక్) జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాకవరపాలెం బీసీ కాలనీలో ఉన్న నాక్ శిక్షణ కేంద్రంలో ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. నాక్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మూడు నెలలపాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఎలక్ట్రీషియన్‌కు పది, ప్లంబింగ్‌కు 8వ తరగతి పాసైన 15 నుంచి 45 ఏళ్లలోపు వయసు గల వారు అర్హులన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేటు సెక్టారుల్లో ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని, ఇతర వివరాలకు 7780275922, 7075340910 నంబర్లను సంప్రదించాలన్నారు.

'కల్యాణపులోవ' నుంచి నీరు విడుదల

చోడవరం: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో సోమవారం కల్యాణపులోవ రిజర్వాయర్ గేట్లు రెండు ఎత్తి 100 క్యూసెక్కుల నీటిని సర్పానదిలోకి విడుదల చేశారు. జలాశయం ఎగువ ప్రాంతం నుంచి 75 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలోకి వచ్చి చేరడంతో రిజర్వాయర్ ప్రమాదస్థాయికి చేరింది. గరిష్ట నీటిమట్టం 460 అడుగులు కాగా ప్రస్తుతం 458.8 అడుగులకు చేరింది. దీంతో రెండు గేట్లు ఎత్తి 100 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని జలాశయం ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. దిగువ ప్రాంతంలో గ్రామాలవారు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

నేడు జాబ్ మేళా

నర్సీపట్నం: డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సౌజన్యంతో మంగళవారం ఎంఎల్ఎల్ఎస్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల చైర్మన్ మీసాల సుబ్బన్న, ప్రిన్సిపాల్ తాతబ్బాయి తెలిపారు. జాబ్ మేళాలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలైన రోజీరామ్ ఎక్స్‌ట్రీమ్ సొల్యూషన్స్, హెటిరో ల్యాబ్స్, జాబ్ డీలర్స్, జెన్ లెనిన్ ఇంటర్నేషనల్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.

క్లుప్తంగా

తోటాడ కుర్రాడికి ఐఐటీ సీటు



సర్వన్ నాయుడును అభినందిస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని తోటాడకు చెందిన దొడ్డి సర్వన్ నాయుడు హైదరాబాద్‌లోని ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ సీటు సాధించాడు. ఈ మేరకు సోమవారం సర్వన్ నాయుడును సచివాలయం వద్ద సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు తదితరులు సత్కరించారు. చదువులో రాణిస్తూ సమాజానికి మేలు చేసే సేవలందించేలా సర్వన్ నాయుడు రాణించాలని ఆకాంక్షించారు. సర్వన్‌నాయుడు చదువులో రాణించేందుకు కృషి చేసిన తల్లిదండ్రులు కిరణ్, దేవిలను అభినందించారు.

జాతీయ తైక్వాండో పోటీలకు ముగ్గురి ఎంపిక



జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికైన యలమంచిలి క్రీడాకారులు

యలమంచిలి రూరల్ : జాతీయ తైక్వాండో పోటీలకు ముగ్గురు యలమంచిలి క్రీడాకారులు ఎంపికయ్యారు. పట్టణానికి చెందిన ఎం.అశోక్, జి.కుస్మిత, కె. శ్యామ్‌లు ఈ ఘనత సాధించారని శాప్ కోచ్ ఎస్.వి.ఎస్ రమేష్ సోమవారం రాత్రి విలేకరులకు తెలిపారు. ఇటీవల గుంటూరులో జరిగిన 3వ రాష్ట్ర సబ్ జూనియర్ కేడెట్ పోటీల్లో ఉమ్మడి జిల్లా తరఫున పోటీల్లో పాల్గొన్న నలుగురిలో ముగ్గురు విశేష ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు, మరొకరు కాంస్య పతకం సాధించారు. వీరిలో బంగారు పతకాలు సాధించిన ముగ్గురు క్రీడాకారులు జాతీయ తైక్వాండో పోటీలకు అర్హత పొందారు. ఆగస్టు 16, 17 తేదీల్లో ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అధ్యక్ష, కార్యదర్శులు ఎ.కొండలరావు, రాంచరణ్ అభినందించారు.

మధ్యవర్తిత్వంపై న్యాయమూర్తులకు శిక్షణ

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై సోమ వారం జిల్లా నూతన కోర్టుల సముదాయ భవనంలో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జునైడ్ అహ్మద్, విజయనగరం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా ఇన్‌చార్జీ, జిల్లా సెషన్స్ జడ్జి యు.యు.ప్రసాద్, ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి (విశాఖపట్నం), సుప్రీంకోర్ట్ మధ్యవర్తిత్వం – సంధి ప్రాజెక్ట్ కమిటీ సీనియర్ శిక్షకు డు (ఎంసీపీసీ, న్యూఢిల్లీ) సురేందర్ సింగ్, విపి తంకచన్, విశాఖ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ–కమ్–సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి న్యాయం జరగాలి

- అధికారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం
- కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



అర్జీదారుల సమస్యను వింటున్న ఎస్పీ ఎం.దీపిక

తుమ్మపాల : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీకి సరైన న్యాయం చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సమస్య పరిష్కరించాలన్నారు. అర్జీలపై గ్రామస్థాయి నుంచి అధికారులు విచారణ చేస్తున్నది లేనిదీ తెలుసుకునేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక బృందంతో కాల్‌సెంటర్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి అర్జీపై అర్జీదారుల అభిప్రాయాలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యలపై స్పందించాలన్నారు.

తెల్లవారు నుంచి కురుస్తున్న వానను సైతం లెక్కచేయకుండా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు కలెక్టరేట్‌కు చేరుకుని అర్జీలు చేసుకున్నారు. అర్జీదారులకు ఎటువంటి కాలయాపన లేకుండా 12 కౌంటర్ల ద్వారా ప్రత్యేక సిబ్బంది అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి రశీదులు అందించారు. మొదటి అంతస్తులో నిర్వహిస్తున్న ఫిర్యాదుల వేదిక వద్దకు నడవలేని దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శిబిరం వద్దకు జిల్లా అధికారులే వచ్చి వారి సమస్యలు తెలుసుకుని అర్జీలను సంబంధిత అధికారులకు సిఫార్సులు చేశారు. ఈ కార్యక్రమంలో వచ్చిన పలు అర్జీల వివరాలిలా ఉన్నాయి.

సామాజిక భవనం కూల్చివేతపై విచారణ చేయాలి

సబ్బవరం మండలం గుల్లేపల్లి గ్రామంలో ప్రభుత్వ సామాజిక భవనాన్ని కూల్చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుని సామాజిక భవన స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామానికి చెందిన జాడ రమణమ్మ అనే మహిళ కలెక్టరేట్ గేటు వద్ద నిరసన చేసింది. తమ గ్రామంలో మార్చి 12న కొందరు వ్యక్తులు సామాజిక భవనాన్ని కూల్చేసిన ఘటనపై గ్రామ స్థాయి నుంచి జిల్లా పంచాయతీ అధికారి వరకు అందరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, సదరు సామాజిక భవనం స్థలంతో పాటు సమీపంలో ఉన్న తన ఇంటి స్థలాన్ని కూడా ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని బాధితురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. జూన్ 27న పంచాయతీ కార్యదర్శి సదరు స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు పెట్టి ఫొటోలు తీసుకుని వెంటనే తొలగించి ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని తెలిపింది. ఫిర్యాదు చేసినందుకు స్థానిక అధికార పార్టీ నాయకులు నతన ఇంటి గోడను, మోటారు, పైప్‌లైన్లను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేసింది.

మినీ గోకులం షెడ్లకు బిల్లులు మంజూరు చేయాలి

గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించుకున్న మినీ గోకులం షెడ్లకు బిల్లులు మంజూరు చేయాలని చీడికాడ మండలం తురువోలు గ్రామానికి చెందిన పాడి రైతులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. 2017–18 ఏడాదిలో అప్పటి ప్రభుత్వం సబ్సిడీ రుణాల కింద మినీ గోకులం షెడ్లు మంజూరు చేయగా ఆవులకు నీడకోసం సొంత నగదుతో నిర్మించుకున్నామని, కానీ బిల్లులు చెల్లించలేదని వాపోయారు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చినందున అప్పుడు ఇచ్చిన హామీ మేరకు తమకు న్యాయం చేయాలని రైతులు పోతల దేముడు, బోజంకి అప్పలనాయుడు, కర్రి రాద, బి.కోటేశ్వరరావు, బి.తమ్మునాయుడు, పోతల రామునాయుడు, బొడ్డు కోటమ్మ, పోతల కోటేశ్వరరావు మీకోసం కార్యక్రమంలో వినతులు అందించారు.

లైన్‌మన్‌పై చర్యలు తీసుకోవాలి

వర్షాకాలంలో అధికంగా వస్తున్న విద్యుత్ సమస్యలపై కనీసం స్పందించకుండా సచివాలయానికే పరిమితమైన విద్యుత్ లైన్‌మన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ చీడికాడ మండలం తురువోలు గ్రామానికి చెందిన చొక్కాకుల సన్నిబాబు, బి.దేముడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వ్యవసాయ బోర్లు, గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరితే దురుసుగా వ్యవహరిస్తున్నాడని వాపోయారు. తక్షణమే అతనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో 37 ఫిర్యాదులు

అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఎస్పీ ఎం.దీపిక వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను తెలుసుకుని వారి ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమానికి 37 ఫిర్యాదులు రాగా వాటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ వంటి ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఎస్ఐ సావిత్రి పాల్గొన్నారు.

తగ్గని వరద ఉధృతి



వడ్డాది డైవర్షన్ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



వడ్డాదిలో వరద పరిస్థితులు, పారిశుధ్యంపై అధికారులతో మాట్లాడుతున్న డీపీవో



తాచేరు డైవర్షన్ రోడ్డు వద్ద సీఐ, ఎస్ఐ బందోబస్తు

బుచ్చెయ్యపేట : మండలంలో సోమవారం జోరు వాన కురిసింది. దీంతో వరద ఉధృతి ఎక్కువవుతోంది. వడ్డాది, విజయరామరాజుపేట గ్రామాల వద్ద తాచేరు, పెద్దేరు నదులు ఉధృతంగా ప్రవహించాయి. సోమవారం వడ్డాది పెద్దేరు డైవర్షన్ రోడ్డుపై నుంచి వరదనీరు ప్రవహించడంతో వంతెనపై నుంచి రాకపోకలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆపేశారు. తరవాత వాహనాల రాకపోకలు విడిచిపెట్టినా నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాత్రి 9 గంటల తరువాత రాకపోకలు లేకుండా అధికారులు నిలిపివేశారు. విజయ రామరాజుపేట తాచేరు నదిలో కూడా నీరు ఉధృతంగా ప్రవహించడంతో దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డు పనులు నిలిచిపోయాయి. డీపీవో శిరీషారాణి, ఆర్డీవో చిన్నికృష్ణ వడ్డాది, విజయరామరాజుపేట గ్రామాల్లో డైవర్షన్ రోడ్లు పరిశీలించి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్ఐ ఈశ్వరరావులకు సూచించారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో వెంకటాచార్య, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, వడ్డాది ఈవో లవరాజు, వీఆర్వోలు సుధాకర్, నాగరాజు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూములపై టీడీపీ పెద్దల కళ్లు

- కారు చౌకగా కొట్టేసేందుకు ప్రయత్నాలు
- ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిస్తాం
- కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం



నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న వీసం

నక్కపల్లి : ఏపీఐఐసీ భూములపై టీడీపీ పెద్దల కళ్లు పడ్డాయని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆరోపించారు. ఈ భూములు తమ వారికి కట్టబెట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సీఆర్‌జెడ్ పరిధిని విస్తరిస్తున్నాయని మండిపడ్డారు. సీఆర్‌జెడ్ పరిధిని పెంచుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన మేనేజ్‌మెంట్ ప్లాన్ ఆమోదం కొరకు మంగళవారం నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిస్తామని ఆయన తెలిపారు. సోమవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా సముద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న నెల్లిపూడి, సీహెచ్‌ఎల్‌పురం గ్రామాలను సీఆర్‌జెడ్‌లో చేర్చడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్లాన్ అమలు జరిగితే ఈ గ్రామాల్లో సొంతిల్లు కట్టుకోవాలన్నా, బోరు నిర్మించుకోవాలన్నా కేంద్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాలన్నారు. తమ స్థలాలపై రైతులకు హక్కు ఉండదన్నారు. ప్రభావిత గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించకుండా, గ్రామాల్లో ప్రచారం చేయకుండా అనకాపల్లిలో ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించడం సమంజసం కాదన్నారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని కూటమి ప్రభుత్వం ఈ కుట్ర పన్నిందన్నారు. మత్స్యకారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. మత్స్యకారుల ఉపాధి కోసం ఫిష్ ప్రాసెస్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవడానికి కుదరదన్నారు. ఈ నోటిఫికేషన్‌లో పేర్కొన్న పలు అంశాలు తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగిస్తాయన్నారు. కొత్తగా పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఏర్పాటు చేయడానికి కుదరదన్నారు. ఏపీఐఐసీ సేకరించిన ఐదు వేల ఎకరాల్లో పరిశ్రమలు ఏర్పాటు కావడానికి ఈ ప్లాన్‌లో పేర్కొన్న నిబంధనలు ఒప్పుకోవన్నారు. రైతుల నుంచి కారు చౌకగా సేకరించిన భూములపై టీడీపీ నాయకుల కళ్లు పడ్డాయన్నారు. ఈ భూములను అప్పనంగా చౌకగా దక్కించుకునేందుకే ఈ జిల్లాలో పోటీ చేశారని ఆరోపించారు. అదే జరిగితే భూములు ఇచ్చిన రైతులతో కలసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. పరిశ్రమల కోసం సేకరించిన భూముల్లో పరిశ్రమలు స్థానికులకే ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో టీడీపీ చేసిన డిమాండ్ ప్రకారం 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ప్యాకేజీ చెల్లించకుండా భూముల జోలికి వస్తే సహించేది లేదన్నారు. రైతులంతా తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మండలంలో నెల్లిపూడి, గునిపూడి, లక్ష్మిపురం, డీఎల్‌పురం చందనాడ, తదితర గ్రామాల ప్రజలంతా అనకాపల్లి వెళ్లి తమ నిరసన తెలియజేస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు కొప్పిశెట్టి హరిబాబు, వెదుళ్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే సంపద కేంద్రాలన్నీ వినియోగం

- జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కోఆర్డినేటర్ నాగలక్ష్మి



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కోఆర్డినేటర్ నాగలక్ష్మి

దేవరాపల్లి : జిల్లాలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలన్నింటిని ఈ నెలాఖరులోగా వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కోఆర్డినేటర్ ఇ.నాగలక్ష్మి తెలిపారు. మండలంలోని ఎం.అలమండ, పెదనందిపల్లి, చిననందిపల్లి, నాగయ్యపేట, దేవరాపల్లి గ్రామాలల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సోమవారం ఆమె పరిశీలించారు. దేవరాపల్లిలో చెత్త సంపద తయారీ కేంద్రం నిర్వహణ పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని మిగిలిన పంచాయితీల ప్రజాప్రతినిధులను, క్లాప్ మిత్రలను క్షేత్ర స్థాయి పరిశీలను తీసుకువచ్చి సంపద తయారీ కేంద్రం నిర్వహణ పట్ల సమగ్రంగా అవగాహన కల్పించాలని ఇంచార్జ్ ఈవోపీఆర్డీ జి.సంతోషి నళినిని ఆదేశించారు. క్లాప్ మిత్రలు యూనిఫాం, గ్లౌజులు తప్పనిసరిగా వినియోగించాలని ఆమె సూచించారు. ఈమె వెంట ఇంచార్జ్ ఈవోపీఆర్డీ సంతోషి నళిని, స్థానిక పంచాయతీ కార్యదర్శి రత్నం, త్రినాథ్ పాల్గొన్నారు.

గోధుమ పిండి టెండర్లలో అవకతవకలు

- రద్దు చేయాలని మిల్లర్ల డిమాండ్

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గోధుమ పిండి కోసం దాఖలైన షార్ట్ టెండర్లను సోమవారం రహస్యంగా తీసి, పాత వారికే కట్టబెట్టారని ఏపీ రోలర్ ఫ్లోర్ మిల్ అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. ఈ టెండర్లు దాఖలు చేసిన వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సోమవారం అమరావతి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ కార్యాలయంలో రహస్యం టెండర్లు తెరిచారని, దీని వల్ల తాము ఎంతో నష్టపోయామని అసోసియేషన్ నాయకులు విశాఖలోని పేర్కొన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం నాయకులు దృష్టి సారించి, టెండర్ల అవకతవకలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

ఆధునిక జన్యు శాస్త్రానికి ఆద్యుడు మెండల్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

యలమంచిలి రూరల్ : ఆధునిక జన్యుశాస్త్రానికి ఆద్యుడు గ్రిగర్ మెండల్ చేసిన ప్రయోగాలు,ఆవిష్కరణలు నేటి సమాజానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. జన్యుశాస్త్ర పితామహుడిగా పేరుగాంచిన గ్రిగర్ జోహన్ మెండల్ 202వ పుట్టినరోజు సందర్భంగా సోమవారం కళాశాల జంతుశాస్త్ర విభాగంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మెండల్ పరిశోధనలు, ఆధునిక జన్యుశాస్త్రానికి ఆయన ప్రయోగాలు ఎలా ఉపయోగపడ్డాయో విద్యార్థులకు వివరించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగు లేకపోయినా గ్రిగర్ మెండల్ తన మేధాశక్తితో ప్రపంచానికి దిశానిర్దేశం చేసిన తీరు, పట్టుదల విద్యార్థులందరికీ స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఈ సందర్భంగా మానసిక ప్రవర్తనపై జన్యువుల ప్రభావం, ఆహారపు అలవాట్లు మానవ ప్రవర్తనపై చూపే ప్రభావం అనే అంశంపై నిర్వహించిన నేషనల్ వెబినార్‌లో భాగంగా గుజరాత్ బార్డోలీ ఉకా టర్సాడియా విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.నాగరత్న సుప్రియ చేసిన ప్రసంగాన్ని విద్యార్థులకు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పోలిరెడ్డి, జంతుశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఆడారి అర్జున అప్పారావు, డాక్టర్ కె. సుజాత, డాక్టర్ విజయలక్ష్మి, తేజస్విని పాల్గొన్నారు.

మద్యం మత్తు ప్రాణం తీసింది



పంట కాలువలో పడి మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు రామారావు

రాంబిల్లి (యలమంచిలి) : మద్యం మత్తులో బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తూ పంటకాలువలో పడి మృతి చెందిన ఘటన సోమవారం రాంబిల్లి మండలం, లాలంకోడూరు శివారు గ్రామం, పెదయాతపాలెం వద్ద చోటు చేసుకుంది. రాంబిల్లి సీఐ నర్సింగరావు తెలిపిన వివరాలివి. శ్రీకాకుళం జిల్లా లంక గ్రామానికి చెందిన గడిదేశి రామారావు (55) రాంబిల్లి మండలం సీతపాలెం వద్ద ఉన్న సన్‌వీరా పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బహిర్భూమికి పెదయాతపాలెం సమీపంలో ఉన్న పంట కాలువ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అంతర్జాతీయ డ్రాయింగ్ పోటీలో కనుమూరి ప్రతిభ



చిత్రం గీస్తున్న కళాకారుడు కనుమూరి శ్రీనివాసరావు

సీతంపేట: ఇటీవల దుబాయ్‌లో ఆన్‌లైన్‌లో జరిగిన అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో నగరానికి చెందిన కళాకారుడు, సమగ్ర శిక్షణ ఉపాధ్యాయుడు కనుమూరి శ్రీనివాసరావు మొదటి బహుమతి సాధించాడు. దుబాయ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సంస్థ రామాయణంలో సుందరకాండ ఘట్టంపై సంకటమోచన్ సీజన్–2 పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించింది. ఈపోటీలలో 6 దేశాలకు చెందిన 225 మంది చిత్రకారులు పాల్గొన్నారు. పబ్లిక్ నుంచి ఓటింగ్, జ్యూరీ సభ్యుల ఓట్ల ఆధారంగా 10/10 ఓట్లు సాధించడంతో కనుమూరి శ్రీనివాసరావు విజేతగా నిలిచాడు. దీనికి సంబంధించి ధ్రువపత్రం, జ్ఞాపిక, రూ.10వేలు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా విజేత కనుమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుందరకాండలోని ప్రధాన ఘట్టాలను అన్ని ఒకచోట దర్శించేలా చిత్రాన్ని గీశానని చెప్పారు. ఎడమ వైపు విఘ్నాలు తొలగించే వినాయకుడు, కుడివైపు రాములవారు హనుమంతుడ్ని ఆశీర్వదించి.. ఉంగరం ఇచ్చి సీతమ్మను వెతకడానికి పంపించడం, లంకా నగరానికి వెళ్లడం, లంకిణి అడ్డగించడం, ఉంగరం సీతమ్మకు ఇవ్వడం, చూడామణి తీసుకుని కిష్కింధకు బయలుదేరడం వంటి సన్నివేశాలు చిత్రీకరించా. మధ్య భాగంలో సీతారామచంద్రుల ఆశీర్వచనాలు అందుకుంటున్న పంచముఖ హనుమంతుడు, అడుగు భాగంలో హనుమంతుడు సాధించిన విజయాలను కొనియాడుతూ దేవతా మూర్తులు నమస్కరిస్తున్నట్లు చిత్రాన్ని గీసినట్టు చెప్పారు. శ్రీనివాస్ సాధించిన విజయంపై సహచర కళాకారులు, పలువురు డ్రాయింగ్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ టీచర్లు అభినందించారు.

గంగవరం పోర్టులో భారీ అగ్ని ప్రమాదం



అగ్నిప్రమాదంలో కాలిపోతున్న కోల్ బెల్ట్

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో ఆదివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కోల్ కన్వేయర్ బెల్ట్‌కు మంటలు అంటుకోవడంతో ఆస్తి నష్టం సంభవించింది. పోర్టు ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగవరం పోర్టు ప్రధాన గేటు నుంచి స్టీల్ ప్లాంట్‌కు వెళ్లే మార్గంలో సెయిల్‌లో యూనిట్ పక్కన 13వ నెంబర్ కన్వేయర్ బెల్ట్ పక్కన ఆదివారం రాత్రి వెల్డింగ్ పనులు చేస్తున్నారు. ఆ సమయంలో నిప్పురవ్వలు ఎగిరి పడడంతో కన్వేయర్ బెల్ట్‌లోని బొగ్గుకు అగ్గి అంటుకుంది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న పోర్టు యాజమాన్య ప్రతినిధులు అక్కడకు హుటాహుటిన చేరుకున్నారు. పోర్టులోని అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సుమారు 3 గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ సందర్భంగా పోర్టు యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కోల్ కన్వేయర్ బెల్ట్‌కు నిప్పు అంటుకుందని, సకాలంలో మంటలను అదుపు చేయడంతో పెద్ద మొత్తంలో ఆస్తి నష్టాన్ని తగ్గించామన్నారు. ఈ కోల్ బెల్ట్ నుంచి స్టీల్ ప్లాంట్‌కు నిరంతరం బొగ్గు సరఫరా చేస్తున్నామని తెలిపారు. మంటలను అదుపు చేసిన వెంటనే కన్వేయర్ బెల్ట్‌ను మార్చి యథావిధిగా బొగ్గును సరఫరా చేశామని వివరించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదని, కొంతమేర ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు.

జిల్లాలో బిందు, తుంపర్ల సేద్యంపై శిక్షణ

- 875 మంది రైతులకు 825 హెక్టార్లలో యూనిట్ల ఏర్పాటు
- జిల్లా సూక్ష్మసాగు నీటి వనరుల ప్రాజెక్టు డీడీ జి.వి.లక్ష్మి



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా సూక్ష్మ సాగు నీటి వనరులు ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మి

నాతవరం : జిల్లాలో 825 హెక్టార్లలో బిందు తుంపర్ల సేద్యం సాగు విస్తరించేందుకు రాయితీపై యూనిట్లు మంజూరు చేశామని జిల్లా సూక్ష్మ సాగు నీటి వనరులు ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టరు జి.వి.లక్ష్మి అన్నారు. ఆమె సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. 2024–25 సంవత్సరానికి గాను యూనిట్లు ఏర్పాటుకు కొత్త ప్రభుత్వం నుంచి అదేశాలు రావాలన్నారు. ఆగస్టులో నియమ నిబంధనలతో పాటు యూనిట్లు ఏవిధంగా ఏర్పాటు చేయాలో లక్ష్యాలు నిర్దేశిస్తారని తెలిపారు. కొత్తగా యూనిట్లు కావాల్సిన రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, వాటికి ఆగస్టు తరువాతే మంజూరు ఉంటుందని వివరించారు. గతంలో ఏర్పాటు చేసిన 875 మంది రైతులకు 825 హెక్టార్లలో యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయా రైతులకు ఆయా సేద్య సామగ్రి వినియోగంపై క్షేత్ర స్థాయిలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసే బిందు, తుంపర్ల సేద్యం యూనిట్లకు కలెక్టరు అదేశాల మేరకు ప్రభుత్వం నుంచి ఆర్థిక పరమైన ఆమోదం తీసుకోవడం జరిగిందని, ఈ విషయంలో రాష్ట్రంలోనే అనకాపల్లి జిల్లాలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జాగరల రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దేరు నుంచి 500 క్యూసెక్కుల నీరు విడుదల



పెద్దేరు జలాశయం గేట్ల ద్వారా నీరు విడుదల

మాడుగుల : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పెద్దేరు జలాశయంలో నీటి మట్టం గణనీయంగా పెరిగింది. జలాశయంలో పూర్తి స్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, సోమవారం సాయంత్రం నాటికి 136.45 మీటర్లకు చేరింది. జలాశయం పరిసర ప్రాంతంలో 20 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని జలాశయం జేఈ జె.వి.సుధాకర్‌రెడ్డి తెలిపారు. వర్షాలకు 500 క్యూసెక్కులు నీరు జలాశయంలోకి వచ్చి చేరుతుందని, సోమవారం రాత్రికి 500 క్యూసెక్కుల నీరు దిగువకు స్పిల్ వే గేట్ల ద్వారా విడుదల చేసినట్లు జేఈ తెలిపారు.

క్లుప్తంగా

పోలవరం కాలువకు జలకళ



తాళ్లపాలెం వద్ద నీటితో కళకళలాడుతున్న అసంపూర్తి పోలవరం కాలువ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద ఉన్న అసంపూర్తిగా ఉన్న పోలవరం కాలువకు జల కళ వచ్చింది. వాయుగుండం ప్రభావంతో కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మోకాలు లోతు వరద నీరు చేరింది. దీంతో నీటితో కాలువ సోమవారం కళకళలాడుతోంది.

28 నుంచి నృత్య పోటీలు

అనకాపల్లి: స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ (విశాఖ) ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ నుంచి ఆల్ ఇండియా ఆన్‌లైన్ డ్యాన్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆర్.జానకి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న సంప్రదాయ నృత్య కళాకారుల ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో దేశభక్తి అంశంతో కూడిన బృంద నృత్యాలతో పాటు జానపద, శాస్త్రీయ నృత్యాంశాల్లో డ్యూయెట్, గ్రూప్ విభాగాల్లో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జూనియర్స్, సీనియర్స్, బృంద విభాగంలో ఫైనల్ విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.50వేలు, 25వేలు, 15 వేలు అందజేస్తామని తెలియజేశారు. దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలు, నృత్యాలయాలు, సాంస్కృతిక సంస్థలకు చెందిన కళాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆల్ ఇండియా స్థాయి ఆన్‌లైన్ పోటీల్లో అత్యుత్తమంగా ఎంపికైన డ్యూయెట్, బృందాలు విశాఖలో జరిగే గ్రాండ్ ఫైనల్స్ (ఆఫ్‌లైన్)లో పాల్గొంటారని తెలియజేశారు. గ్రాండ్ ఫైనల్స్ విజేతలకు 'వికసిత్ భారత్ నృత్య ట్రోఫీ–2024'తో పాటు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తామని తెలిపారు. కళాకారులు పేర్ల నమోదు, మరిన్ని వివరాలకు 85229 90123 నంబరులో సంప్రదించాలని కోరారు.

కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో టమాటాలు కిలో రూ.70కి విక్రయాలు సాగాయి. అలాగే ఉల్లిపాయ, బంగాళాదుంప, బెండకాయ, దొండకాయ, క్యారెట్, బీట్‌రూట్, చిక్కుడు కిలో రూ.40, వంకాయ, బీరకాయ రూ.50, గోరు చిక్కుడు, క్యాప్సికం రూ.60కి విక్రయించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 67 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	3,600	3,600
మూడోరకం	3,300	3,300

అనకాపల్లి సినిమాలు

ప్రభుత్వ జూనియర్ కళాశాల: రాజా

కల్కి 2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి 2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-2
డార్లింగ్	: షిర్డీసాయి
భారతీయుడు 2	: పర్తిసాయి
సీడీ	: వెంకటేశ్వర
డిమొంటే కాలనీ	: శ్రీసత్య
బర్త్‌డే బాయ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 82 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–11 యూనిట్లు, బీ పాజిటివ్–30 యూనిట్లు, ఓ పాజిటివ్–39 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 347 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 236 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

హామీలన్నీ నెరవేరుస్తారా..!

'ఎన్నికల ముందు బోలెడు హామీలు ఇచ్చారు. సూపర్ సిక్స్ పేరుతో పలు ఆకర్షణీయమైన పథకాలను అమలు చేస్తామని ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. వీటిలో ఒక్క దాని గురించి కూడా ఇంత వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. అధికారంలోకి వచ్చి దాదాపు 45 రోజులు కావస్తోంది. కక్ష సాధింపులకు స్వస్తి పలికి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి' అని అంటూ పలువురు నియోజకవర్గ ప్రజలు అధికార పార్టీ ఎమ్మెల్యేను కోరుతున్నారు.



ఎన్నో చెప్పారు.. అన్నీ చేయండి
- సుపరిపాలన కావాలి.. సమస్యలు పరిష్కరించాలి
- అసెంబ్లీలో మా గోడు వినిపించండి
- అధికార పార్టీ ఎమ్మెల్యేకు నియోజకవర్గ ప్రజల వినతి

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అనకాపల్లి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీలు ఇచ్చింది. ఈ నెల 22 నుంచి ఎమ్మెల్యేలు శాసనసభలో వారివారి గళం విప్పుతున్నారు. అనకాపల్లి పట్టణం, మండలంలో ప్రధానమైన సమస్యల పరిష్కారం కోసం కూటమి ఎమ్మెల్యే, ఎంపీలు దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

లక్ష్మీదేవిపేట రైల్వే బ్రిడ్జి

అనకాపల్లి పట్టణంలో రైల్వే స్టేషన్ వద్ద లక్ష్మీదేవిపేట రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలి. సుమారు 10 ఏళ్ల కిందట రైల్వే అధికారులు తమ పరిధిలో బ్రిడ్జి నిర్మించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న బ్రిడ్జిని నిర్మించినట్లయితే అనకాపల్లి నుంచి చోడవరం, వడ్డాది, మాడుగుల, పాడేరు ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు, వాహన చోదకులకు ఎంతో మేలు జరుగుతుంది.

తాగునీటి కుళాయిలు

అనకాపల్లి పట్టణానికి విశాఖ జిల్లా అగనంపూడి నుంచి అనకాపల్లి పట్టణంలో ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు రూ.35 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. త్వరితగతిన పనులు పూర్తిచేసి పరిశుభ్రమైన తాగునీరు అందించాలి.

రహదారి పనులు

పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ మీదుగా రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలి, ఈ రోడ్డు విస్తరణలో గృహ యజమానులకు ఇప్పటికే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించింది. 60 శాతం మేరకు రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చెంది, మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. ఈ రహదారిలో ప్రతి ఏటా కోట్లాది రూపాయల లావాదేవీలు జరుగుతాయి.

జలగలమధుం రోడ్డు అభివృద్ధి

జాతీయ రహదారి జలగల మధుం జంక్షన్ నుంచి సుంకరమెట్ట జంక్షన్ వరకూ గత ప్రభుత్వంలో నాలుగులైన్ల రహదారిని అభివృద్ధి చేశారు. అనకాపల్లి నుంచి విశాఖ వెళ్లే జలగల మధుం కూడలి సమీపంలో రెండు పెట్రోల్ బంకుల వద్ద రహదారి వేయకపోవడంతో నిత్యం వేలాది మంది వాహన చోదకులు అనకాపల్లి నుంచి విశాఖ రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికే పెద్దపెద్ద గోతులతో రహదారి ఘోరంగా తయారైంది. రాత్రి సమయంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది.

ఉద్యోగ అవకాశాలు

మండలంలోని కొడూరు పంచాయతీ పరిధిలో ఏపీఐఐసీలో రహదారులు, డ్రైనేజీలను అభివృద్ధి చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటే పరిశ్రమలు సాధించాలి. తద్వారా నిరుద్యోగులకు ఉపాధి కలగడమే కాకుండా గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయి.
- పట్టణ, మండలంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి. ప్రధానమైన కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టి, వర్షపు నీరు పారేలా చర్యలు తీసుకోవాలి.
- గోయిన్స్‌ను బాగు చేసి రైతులకు నీరు అందించాలి.

చొరవ చూపండి

కశింకోట: మండలంలో తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరించడానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.
- కశింకోట బాలికల హైస్కూల్‌ను జూనియర్ కళాశాలగా అభివృద్ధి చేయాలి. ఇక్కడ 600 పైగా బాలికలు చదువుతున్నారు. వీరు టెన్త్ పూర్తయ్యాక ఉన్నత చదువులకు అనకాపల్లి, విశాఖ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొందరు దూరం వెళ్లలేక చదువులకు స్వస్తి చెబుతున్నారు.
- కశింకోటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరు దశాబ్దాలుగా వైద్య, ఆరోగ్య సేవలు ప్రాథమిక స్థాయికే పరిమితమవుతున్నాయి. దీని స్థాయి పెరగడం లేదు. ఉన్నత వైద్యం అందడం లేదు. దీన్ని 30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసి ఉన్నత వైద్యం అందుబాటులోకి తేవాల్సి ఉంది.
- తాళ్లపాలెం పీహెచ్‌సీ.. చుట్టుపక్కల గ్రామాలకు కూడలిగా ఉంది. దీన్ని కూడా ఆస్పత్రి స్థాయికి పెంచి గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలందించాల్సి ఉంది.
- కశింకోట కూడలిలో జాతీయ రహదారిపై సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. విపరీతమైన రద్దీ వల్ల ఇక్కడ సిగ్నల్స్ లేక ప్రజలు, విద్యార్థులు, వాహన చోదకులు రోడ్డు దాటడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పలు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.
- కశింకోటలో బీసీ హాస్టల్‌కు ప్రహరీ నిర్మించి వసతి సదుపాయాలను మెరుగు పర్చాలి.
- కశింకోట బాల సదనంలో పూర్తిస్థాయిలో సరైన సదుపాయాలు లేక బాలికలు ఇబ్బంది పడుతున్నారు. మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాల్సి ఉంది.
- అమీన్‌సాహెబ్‌పేట, నరసింగబిల్లి రైల్వే గేట్ల వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాల్సి ఉంది. ఇవి లేక రైల్వే గేట్ల వద్ద ఎక్కువ సమయం ప్రజలు, వాహన చోదకులు నిరీక్షించాల్సి వస్తోంది.
- కన్నూరుపాలెం–తోటకూరపాలెం, అచ్చెర్ల రోడ్డు–అచ్చెర్ల గ్రామాల మధ్య ఉన్న చెరో ఐదారు కిలో మీటర్ల గతుకుల రోడ్లను తారు రోడ్లగా పునరుద్ధరించి అభివృద్ధి చేయాల్సి ఉంది.
- జాతీయ రహదారి నుంచి వేర్వేరుగా ఉన్న ఉగ్గినపాలెం, జమాదులపాలెం గ్రామాలకు చెరో రెండు కిలో మీటర్ల పొడవునా తారు రోడ్లను పునరుద్ధరించాలి.
- మండల గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి ప్రజలకు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాల్సి ఉంది.
- కశింకోట, నరసింగబిల్లి తదితర స్కూళ్లలో అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయాలి. అదనపు తరగతి గదులను నిర్మించాలి.

ప్రతి ఎకరాకు సాగునీరందించాలి



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ.. జనసేన అభ్యర్థిగా నియోజకవర్గ అభివృద్ధికి అనేక హామీలు ఇచ్చారు. రైతాంగాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రతి ఎకరానికి సాగు నీరు అందిస్తామన్నారు. సాగు నీరు లేక రైతులు కూలీలుగా మారి వలసలు పోతున్నారు. వాటిని అరికడితే రైతులు వ్యవసాయం ద్వారా అభివృద్ధి చెందుతారన్నారు. ప్రస్తుతం వరి సాగుకు పుష్కలంగా నీరందేలా ఏటీ కాలువల్లో పూడికతీత చేపట్టి మెట్టు ప్రాంతాల్లో పొలాలకు నీరందించాలి. – కరణం గాంధీ, రేబాక గ్రామం

త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలి



కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి. ఇప్పటికే అనకాపల్లి పట్టణంలో అనేక సమస్యలు ఉన్నాయి. ప్రధానంగా తాగునీరు, పెరుగుబజారు రహదారి, లక్ష్మీదేవిపేట రైల్వే బ్రిడ్జి పనులు చేసినట్లయితే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుంది. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ విషయంలో చర్యలు తీసుకోవాలి. – సోమేష్, అనకాపల్లి

అచ్చెర్ల రోడ్డును బాగుచేయండి



అచ్చెర్ల కూడలి నుంచి గ్రామానికి వెళ్లే 5 కిలో మీటర్ల పొడవున్న రోడ్డు గతుకులతో నిండి ఉంది. దీనివల్ల రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. భారీ వాహనాల తాకిడికి రోడ్డు దెబ్బతింది. ఈ మార్గంలో ప్రయాణం సాగించడానికి ఉపయోగపడే ఆటోలు, బైకులు గోతుల్లో పడి తరచుగా మరమ్మతులకు గురవుతున్నాయి. ఒక్కోసారి ప్రమాదాలు జరుగుతున్నాయి. దీని దృష్ట్యా రోడ్డులో గతుకులు పూడ్చి పునరుద్ధరించాలి. – గొలగాని నాయుడు, అచ్చెర్ల, కశింకోట మండలం

ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయాలి



కశింకోట కూడలిలో జాతీయ రహదారి దాటడం ప్రమాదకరంగా ఉంది. రోడ్డుకు రెండువైపులా వరుసపెట్టి వెల్లువలా రాకపోకలు సాగిస్తున్న వాహనాల రద్దీతో నిత్యం రోడ్డు దాటడం భయంగా పరిణమిస్తోంది. ఎక్కువ సమయం నిరీక్షించాల్సి వస్తోంది. సాహసిస్తే ప్రమాద భయంతో సతమతమవుతున్నాం. దీని దృష్ట్యా ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయాలి. – కాటిపాముల లక్ష్మి, కశింకోట

చిత్తడిగా తాళ్లపాలెం వారపు సంత

- దుకాణాల చుట్టూ చేరిన వర్షపు నీరు
- ఇబ్బందులు పడిన వ్యాపారులు, కొనుగోలుదారులు



తాళ్లపాలెం వారపు సంతలో కూరగాయల దుకాణాల వద్ద చేరిన వర్షపు నీరు



బురదమయంగా మారిన గొర్రెలు, మేకల సంత ప్రాంతం



తాళ్లపాలెం సంత వద్ద నర్సీపట్నం వైపు రోడ్డులో నిలిచిపోయిన వాన నీరు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంత సోమవారం చిత్తడిగా మారింది. దీంతో వ్యాపారులు, స్థానిక ప్రజలు ఇబ్బంది పడ్డారు. తుపాను కారణంగా వర్షం కురవడంతో కూరగాయల సంత ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాల్లో దుకాణాల చుట్టూ నీరు చేరింది. ఆ నీటిలో నుంచి ప్రజలు వెళ్లి దుకాణాల్లో వస్తువులు కొనుగోలు చేసుకోవలసిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. వర్షాల వల్ల సంత అంతంత మాత్రంగా సాగింది. గొర్రెలు, మేకల విక్రయ సంత ప్రాంతం బురదమయంగా తయారైంది. ఆ బురదలోనే అమ్మకాలు సాగించడానికి వ్యాపారులు, కొనుగోలుదారులు, పెంపకందారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇక సంత వద్ద తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వెళ్లే రోడ్లు, భవనాల శాఖకు చెందిన రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో వాహన చోదకులు, ప్రజలు ఇబ్బంది చెందారు. వర్షం పడిన ప్రతిసారి నీరు నిల్వ ఉండిపోయి ఇబ్బందులకు గురి చేస్తోందని, అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

కనుల పండువగా పవిత్రోత్సవాలు

వేంకటేశ్వరస్వామికి కలశాభిషేకం



పూజకు సిద్ధం చేసిన 1001 కలశాలు



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

అనకాపల్లి: దేమునిగుమ్మంలోని అలిమేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు సోమవారం విశేష పూజలు చేశారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం గిరిబాబు, విజయబాబు ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, హోమం, బేడాసేవ నిర్వహించారు. అనంతరం 1001 కలశాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కళాకారులు ఆలయ ఆవరణలో ప్రదర్శించిన జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో రాజసులోచన, అర్చకులు ప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

కూలిన పెంకుటిల్లు ముందుభాగం



బోయిపేటలో కూలిన పెంకుటింటి ముందు భాగం

కశింకోట: కశింకోట మేదర వీధిలోని బోయిపేటలో భారీ వర్షాలకు పెంకుటింటి ముందు భాగం కూలింది. ఆ సమయంలో నివాసితులు ఇంట్లోనే ఉన్నప్పటికీ, అదృష్టవశాత్తు ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బోయిపేటలోని మూడు పోర్షన్ల పెంకుటింట్లో రెండు పోర్షన్లలో ఈర్లె రామకృష్ణ, ఈర్లె మోహనరావు నివాసం ఉంటున్నారు. వర్షాలకు పెంకుటిల్లు దెబ్బతినడంతో వీరు ఉంటున్న పోర్షన్ల ముందు భాగంలో పైభాగం దెబ్బతిని కూలిపోయింది. ప్రమాద సమయంలో వీరి కుటుంబ సభ్యులు ఇళ్లలోనే ఉన్నారు. బయట ఉంటే ప్రమాదం జరిగి ఉండేదని బాధితులు తెలిపారు. పేదలమైన తమ ఇళ్లకు నష్ట పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

వరి నారుమడుల్లో వర్షపు నీటిని వెంటనే తొలగించాలి

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు
- సబ్‌డివిజన్ పరిధిలో వరి నారుమడుల పరిశీలన
- రైతులకు సూచనలు



తుమ్మపాలలో నారుమడులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు



నూతన గుంటపాలెంలో నారును పరిశీలిస్తున్న ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ రమణమూర్తి

అనకాపల్లి: వరి నారుమడులు వేసిన రైతులు నారు మడిలో నీటిని తక్షణమే తొలగించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.మోహన్‌రావు అన్నారు. మండలంలో తుమ్మపాల గ్రామంలో వరి నారుమడులను, వరి ఎద వేసిన పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడుల్లో నీరు తగ్గిన తర్వాత నాలుగు సెంట్ల నారు మడికి ఒక కేజీ పొటాషియం, ఒక కేజీ యూరియా కలిపి వేయాలని సూచించారు. నారుమడులు పూర్తిగా దెబ్బతింటే వరి దుంప నారుమడులు వేసుకోవాలన్నారు. కౌలు రైతులు గ్రామ రెవెన్యూ అధికారులను కలిసి కౌలు గుర్తింపు కార్డుల కోసం అర్జీ పెట్టుకోవాలన్నారు. బొజ్జన్న కొండ ఏరియాలో కాల్వ సరిగ్గా లేకపోవడం వల్ల పొలాల్లో నీరు నిల్వ ఉండి వరి నారుమడులు, ఆకుమడులు నష్టపోయే అవకాశం ఉందని, త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

వ్యవసాయ పనులు వాయిదా వేసుకోవాలి

జిల్లా ఇరిగేషన్ ఏఈ హనుమంతరావు మాట్లాడుతూ మరో రెండు, మూడు రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు వ్యవసాయ పనులను వాయిదా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు, వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.రామారావు, మండల వ్యవసాయ అధికారి పి.రంగాచారి, ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, వీఆర్వో కోరాడ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తల పరిశీలన

అనకాపల్లి: అనకాపల్లి మండల పరిధి తుమ్మపాల, చుట్టుపక్కల గ్రామాల్లో 100 ఎకరాల్లో నారుమడులు వర్షపు నీటిలో ఉన్నాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సెజ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.వి.రమణమూర్తి తెలిపారు. రైతులు నారుమడుల్లో వర్షపునీటిని బయటకు పంపించాలని సూచించారు. ఆర్ఏఆర్ఎస్ అనకాపల్లి సబ్ డివిజన్ పరిధిలో కశింకోట, మునగపాక, అనకాపల్లి మండలాల్లో వరి నారుమడులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నారుమడుల్లో నీటిని తొలగించిన తరువాత 19–19–19 రకం లీటరు నీటికి 5 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలన్నారు. వరినారుమడుల్లో ఎక్కడైనా పొడతెగుళ్లు సోకితే ప్రోపికోనజోల్ 1 మి.లీ.లీటరు నీటిలో లేదా ఎక్సోకోనజోల్ 2 లీటర్లు నీటిలో 2 మి.లీ. పిచికారి చేయాలని చెప్పారు.

కశింకోట మండలం పి.సోమవారం గ్రామంలో 20–30 రోజుల నారుమడులు ఉన్నాయని, అక్కడి రైతులు పొలాల్లో నారు నాటుకోవాలని సూచించారు. కశింకోట మండలంలో నూతనగుండపాలెం, వై.తుని, జెడ్.తుని, పల్లపు సోమవారం గ్రామాల్లో 280 ఎకరాల నారుమడి వర్షాలకు నీటిలో ఉందన్నారు. మునగపాక మండలంలో మునగపాక, వాడ్రాపల్లి గ్రామాల్లో 50 ఎకరాల్లో, కొన్ని ప్రాంతాల్లో నేరుగా డ్రమ్‌సీడర్ ద్వారా విత్తనాలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త రాజ్‌కుమార్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నారుమళ్ల వివరాల సేకరణ

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెంలో తుపాను ప్రభావంతో భారీ వర్షాలకు నీట మునిగిన వరి నారుమళ్లను సోమవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా నీట మునిగి నష్టం ఏర్పడిన నారుమళ్ల వివరాలను సేకరించారు. నష్టపోయిన రైతులకు కావలసిన విత్తనాలు సమకూర్చడానికి వివరాలు సేకరించారు. నీరు బయటకు వెళ్లకుండా ఉన్న నారుమళ్లను నష్టంగా పరిగణించే విషయమై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. బృందంలో ఆర్ఏఆర్ఎస్ వ్యవసాయ శాస్త్రవేత్త కె.వి.రమణమూర్తి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజ్‌కుమార్, జిల్లా వనరుల కేంద్రం ప్రతినిధి విజేత, మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న ఉన్నారు. ముందుగా కశింకోట, వెదురుపర్తి, ఏనుగుతుని గ్రామాల్లో కూడా నీట మునిగిన నారుమళ్లను వ్యవసాయ అధికారి స్వప్న పరిశీలించి, వాటి సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు సూచించారు.

25న ఉచిత కంటి వైద్య శిబిరం

పరవాడ: అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో పరవాడ గ్రామంలో ఈ నెల 25న శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు చెప్పారు. ఆరోజు పరవాడ సినిమాహాలు కూడలిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీకార్డు, ఫోను నెంబరు, రెండు జతల దుస్తులు, కంచం, గ్లాసు వెంట తీసుకు రావాలని ఫౌండేషన్ ప్రతినిధులు సూచించారు.

సేంద్రియ సాగుతో అధిక లాభాలు

ఏవో సత్యనారాయణ

సబ్బవరం: సేంద్రియ సాగులో అధిక దిగుబడితో పాటు ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులను లభిస్తాయని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. ఖరీఫ్ సాగు చేసే భూముల్లో పచ్చి రొట్ట ఎరువులు వేయడం ద్వారా భూమి సారం పెరుగుతుందని చెప్పారు. సోమవారం ఆయన నారుమడుల నిర్వహణ,వంటి పలు అంశాలను వివరించారు. పచ్చి రొట్ట ఎరువులను వర్షాలు పడిన వెంటనే భూమిలో కలియ దున్నడం వల్ల వారం రోజుల్లో కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుందని తెలిపారు.

వరినారు మళ్ల సంరక్షణపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నారు మళ్లలో పొడతెగులు సోకితే హెగ్జా కోనజోల్ 2 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.అగ్గి తెగులు సోకితే ట్రై సైక్లోజోల్ గ్రాము లీటర్ నీటిలో కలపాలన్నారు. దమ్ములకు ముందే పొలాల్లో దుక్కు చేస్తే వరినాట్లు వేసిన తర్వాత కలుపు బెడద తగ్గుతుందన్నారు.

పొంగుతున్న గెడ్డలు



గొబ్బూరు గ్రోయిన్‌పై ప్రవహిస్తున్న మామిడివాక గెడ్డ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద ఉన్న మామిడివాక గెడ్డ భారీ వర్షాలకు పొంగి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద నీరు చేరింది. అది ఇక్కడి గొబ్బూరు గ్రోయిన్ మీదుగా ఉరకలేస్తూ ప్రవహిస్తోంది. ఇది అమీన్‌సాహెబ్ పేట వద్ద శారదానదిలో కలుస్తుంది.